ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 నంద్యాల

జిల్లా వార్తలు

శనివారం 27 ఏప్రిల్ 2024



బుగ్గన బురిడీ..!



- జనాలను ఆయనే ఉద్ధరించినట్టు కలరింగ్
- పనులు చేయకుండానే ప్రచారం
- చెరువులకు నీళ్లు నింపకుండా మోసం
- తామే అంత చేసినట్టుగా ఎన్నికల ముందు హడావుడి
- ఐదేళ్లపాటు మభ్యపెట్టిన వైనం
- కరువు రైతులకు తప్పని కన్నీటి వేదన



డోన్, ఏప్రిల్ 26:

చెరువులకు నీళ్లు నింపుతామని ఊదరగొట్టారు.. కరువు నేలను తడిపి.. సస్యశ్యామలం చేస్తామని గత ఎన్నికల ముందు మాట ఇచ్చారు.. తీరా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి బుగ్గన నాలుక మడతేశాడు. ఒట్టి మాటలతో ఐదేళ్లపాటు రైతులను నమ్మించి చివరకు చేతులెత్తేశాడు. ఎన్నికల ముందు సీఎం జగన్‌ను పిలిపించి హడావుడిగా చెరువులకు నీరు నింపే పథకాన్ని ప్రారంభించారు. అది కూడా అంతా మోసమేనని బట్టబయలైపోయింది. బిల్డప్ ఇచ్చి రైతులను నమ్మించారు తప్ప.. ఒక్క చెరువులో కూడా నీరు నింపలేదని తెలుస్తోంది. బుగ్గన డోన్ నియోజకవర్గంలో కరువు రైతులకు కన్నీరే మిగిల్చారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైతుల ఆశలు ఆవిరి

డోన్ నియోజకవర్గంలో చెరువులకు నీరు నింపే పథకంపై రైతులు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. డోన్, ప్యాపిలి మండలాల్లోని చెరువుల కింద దాదాపు పది వేల ఎకరాలకు పైగానే ఆయకట్టు సాగు భూమి ఉంది. హంద్రీనీవా ప్రాజెక్టు నుంచి నీళ్ల నింపే కరువు నేలను తడుపుకుని పంటలు పండించుకోవచ్చని రైతులు ఐదేళ్లపాటు ఎదురు చూశారు. అయితే.. చెరువులకు నీళ్ల నింపకపోవడంతో రైతుల బాధ వర్ణనాతీతంగా మారింది. వైసీపీ పాలకుల ఒట్టి మాటలతో మోసపోయామని రైతులు కన్నీటి వేదనతో కుమిలిపోతున్నారు. చెరువులకు నీళ్ల ఎప్పుడు నింపుతారోనని కళ్లల్లో ఒత్తిళ్ల వేసుకుని రైతులు ఎదురు చూస్తున్నారు.



అభిరెడ్డిపల్లె చెరువు



బీడుగా మారిన చెరువు ఆయకట్టు భూమి



నీరు లేక ఎండిపోయిన డోన్ మండలంలోని కొచ్చెర్వు చెరువు

నారా లోకేశ్ రైతులకు భరోసా

ఉమ్మడి జిల్లాలోని డోన్, పత్తికొండ చెరువులకు హంద్రీనీవా ప్రాజెక్టు నుంచి నీరు నింపే బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. గత ఏడాది ఏప్రిల్ నెలలో డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలంలో నారా లోకేశ్ యువగళం పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చెరువులకు నీళ్ల నింపి రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతామని లోకేశ్ భరోసా ఇచ్చారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చెరువులకు నీరు నింపే పథకానికి నిధులు మంజూరు చేసినా వైసీపీ ప్రభుత్వం నీళ్ల నింపలేక రైతులకు అన్యాయం చేసిందన్నారు. లోకేశ్ హామీ ఇవ్వడంపై డోన్ నియోజకవర్గంలోని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్, పత్తికొండ నియోజకవర్గాలు ఎప్పటి నుంచో కరువు ప్రాంతాలుగా నలిగిపోతున్నాయి. వర్షాధారం మీదనే ఆధారపడి ఇక్కడి రైతులు పంటలను సాగు చేస్తున్నారు. కరువు పరిస్థితులతో ప్రతిఏటా నష్టపోతూనే ఉన్నారు. పంటలు లేక నియోజకవర్గంలో వందల కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తూనే ఉంటారు. దీంతో హంద్రీనీవా ప్రాజెక్టు నుంచి చెరువులకు నీరు నింపి కరువు రైతులకు మేలు చేయాలని టీడీపీ హయాంలో నాటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి సంకల్పించారు. హంద్రీనీవా ప్రాజెక్టు నుంచి 68 చెరువులకు నీరు నింపేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాజెక్టులకు నాటి సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపి రూ.230 కోట్లు మంజూరు చేశారు. హైదరాబాదుకు చెందిన కోయా కంపెనీకి నిర్మాణ పనులను అప్పగించారు. 2019 ఎన్నికల నాటికి చెరువులకు నీరు నింపే నిర్మాణ పనులను 30 శాతం పూర్తి చేశారు. అయితే.. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది.

చెరువులకు నీళ్లు నింపుతానని చెప్పి..

గత ఎన్నికల ముందు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెరువులకు నీళ్ల నింపుతానని హామీ ఇచ్చారు. కరువు రైతుల జీవితాలు మారుస్తానని బుగ్గన నమ్మబలికాడు. ఆర్థిక మంత్రి అయిన తర్వాత కూడా బుగ్గన పదే పదే చెరువులకు నీరు నింపుతానని మాట ఇస్తూ వచ్చాడు. ఏడాది లోపల చెరువులకు నీళ్ల ఇచ్చి రైతుల జీవితాలు సస్యశ్యామలం చేస్తానని చెబుతూ వచ్చాడు. అయితే.. మంత్రి బుగ్గన ఇచ్చిన మాట అబాసుపాలైంది. చెరువులకు నీళ్ల నింపే ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో అంతులేని జాప్యం జరుగుతున్నా.. మంత్రి బుగ్గన పెద్దగా శ్రద్ధ చూపలేదు. అదిగో నీళ్ల ఇస్తాం.. ఇదిగో ఇస్తాం.. అంటూ హామీని మాటలకే పరిమితం చేశాడు. అలాగే ఐదేళ్ల గడిపేసి మంత్రి బుగ్గన చేతులెత్తేశాడన్న విమర్శలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

సీఎం జగన్‌తో.. బిల్డప్

ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో మంత్రి బుగ్గన మరో మోసానికి తెర లేపాడన్న విమర్శలున్నాయి. డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో 72 చెరువులకు హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీళ్ల నింపుతున్నట్లు ప్రకటించారు. గత ఏడాది సెప్టెంబరు 19వ తేదీన సీఎం జగన్ డోన్, క్రిష్ణగిరి మండలాల్లో పర్యటించారు. సీఎం జగన్‌తో ఉత్తుత్తి బిల్డప్ ఇచ్చి చెరువులకు నీళ్ల నింపుతున్నట్లు పథకాన్ని ప్రారంభించారు. డోన్ నియోజకవర్గంలో 36 చెరువులకు నీళ్ల నింపుతున్నట్లు మంత్రి బుగ్గన వేదికల మీద ఊదరగొట్టారు. అయితే.. నియోజకవర్గంలో ఏ ఒక్క చెరువుకూ నీళ్ల నింపిన దాఖలాలు లేవు.



చెరువులకు నీళ్లు నింపే పథకం ప్రారంభోత్సవంలో సీఎం జగన్ (ఫైల్)

రైతులను మోసం చేశారు



డోన్ నియోజకవర్గంలో చెరువులకు హంద్రీనీవా నీరు నింపేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చెరువులకు నీళ్ల నింపే పథకం పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించింది. మంత్రి బుగ్గన చెరువులకు నీరు నింపుతానని ఒట్టి మాటలు చెబుతూ ఐదేళ్ల కాలం గడిపాడు. రైతులను మోసం చేసిన వైసీపీని డోన్ నియోజకవర్గ ప్రజలు నమ్మరు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక చెరువులకు నీరు నింపుతానని నారా లోకేశ్ భరోసా ఇవ్వడం సంతోషకరం.

- గోసానిపల్లి మల్లయ్య, తెలుగు రైతు సంఘం నాయకులు, డోన్

టీడీపీతోనే సాధ్యం



డోన్ మండలంలోని అభిరెడ్డిపల్లె చెరువు కింద రెండు వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. హంద్రీనీవా ప్రాజెక్టు నుంచి నీళ్ల నింపి ఉంటే.. రైతులకు ఎంతో మేలు జరిగేది. ఐదేళ్ల నుంచి నీళ్ల నింపుతామని మంత్రి బుగ్గన మాటలతోనే నమ్మించి మోసం చేశాడు. చెరువులకు నీళ్ల నింపించడం టీడీపీతోనే సాధ్యమవుతుంది.

- గోపాల్, వెంకటాపురం, రైతు, డోన్

బుగ్గన నామినేషన్‌పై ఉత్కంఠ

- ఆరు గంటలపాటు పెండింగ్
- ఆమోదంపై అనుమానాలెన్నో...
- ఉన్నత స్థాయి ఒత్తిడితో అంగీకరించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి..?
- ఆస్తుల వివరాలన్నీ అఫిడవిట్‌లో చూపలేదని టీడీపీ అభ్యంతరం
- న్యాయపరంగా పోరాటం చేయాలని నిర్ణయం



డోన్ ఆర్డీవో కార్యాలయంలో జరుగుతున్న స్క్రూటినీ

డోన్, ఏప్రిల్ 26: డోన్ అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎన్నికల నామినేషన్ ఆమోదం ఉత్కంఠగా మారింది. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆరు గంటలపాటు అనేక నాటకీయ పరిణామాల మధ్య చివరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆమోదించారు. డోన్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి, అసిస్టెంట్ ఆర్వోల ఆధ్వర్యంలో నామినేషన్ పత్రాల స్క్రూటినీ నిర్వహించారు. డోన్ వైసీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నామినేషన్ పత్రంలోని అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలన్నీ పొందుపరచలేదని టీడీపీ తరఫు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. అంతేగాక నామినేషన్ పత్రంలో పలు కాలమ్స్ ఖాళీగా వదిలేయడం నిబంధనలకు విరుద్ధమని అభ్యంతరం తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి మొదట బుగ్గన నామినేషన్ పత్రాల్లో తప్పులు ఉన్నాయని అంగీకరించి పెండింగ్‌లో ఉంచారు. అంతేగాక టీడీపీ అభ్యంతరాలకు సమాధానం ఇవ్వాలని వైసీపీ అభ్యర్థి బుగ్గన తరఫు న్యాయవాదులకు ఆర్వో నోటీసులు జారీ చేశారు. దీంతో ఒక్కసారిగా వైసీపీ శిబిరంలో కలకలం రేగింది. ఈ నేపథ్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిని వైసీపీ న్యాయవాదులు కలిసి చాలా సేపు చర్చించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

● ఉన్నత స్థాయి అధికారి నుంచి ఫోన్ కాల్?

బుగ్గన నామినేషన్ పెండింగ్‌లో పడడంతో రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వ్యక్తులు రంగంలో దిగారని తెలిసింది. డోన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫోన్ చేసి దాదాపు 15 నిమిషాలు మాట్లాడి ఒత్తిడి చేసినట్లు టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలోనే సాయంత్రం 5.30 గంటలకు బుగ్గన నామినేషన్‌ను ఆమోదించినట్లు ఆర్వో ఉత్తర్వులు జారీ చేశారని టీడీపీ అంటోంది. బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నామినేషన్‌ను నిబంధనలకు వ్యతిరేకంగా ఆమోదించడంపై న్యాయ పోరాటం చేస్తామని టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు.

శ్రీశైలంలో శాస్త్రోక్తంగా కుంభోత్సవం

శ్రీశైలం, ఏప్రిల్ 26: శ్రీశైల మహాక్షేత్రంలోని శుక్రవారం శాస్త్రోక్తంగా కుంభోత్సవం నిర్వహించారు. ప్రతిఏటా చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత అమ్మవారికి కుంభోత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయబద్ధంగా వస్తోంది. ఇందులో భాగంగానే భ్రమరాంబికాదేవి అమ్మవారి ఆలయాన్ని గుమ్మడికాయలు, నిమ్మకాయలు, పుష్పాలతో అలంకరించారు. కుంభోత్సవంలో భాగంగా ఉదయాన్నే అమ్మవారికి ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. అలాగే రజక వర్గానికి చెందిన వ్యక్తి చేత అమ్మవారి ఆలయంలోని శ్రీచక్రం వద్ద ఆనవాయితీ ప్రకారం ముగ్గు వేయించి కుంభోత్సవానికి నాంది పలికారు. అలాగే హరిహరరాయ గోపురం వద్ద గల మహిషాసురమర్దిని అమ్మవారికి పూజాదికాలు జరిపి ఆ తర్వాత గుమ్మడికాయలు, కొబ్బరికాయలతో పాటు నిమ్మకాయలతో సాత్వికబలిని సమర్పించారు. అదేవిధంగా ఉత్సవంలో పసుపు కుంకుమలను రాసులుగా సమర్పించి అమ్మవారికి శాంతి ప్రక్రియ క్రతువును పూర్తిచేశారు. సాయంత్రం మల్లికార్జున స్వామివారికి ప్రదోషకాల పూజల అనంతరం స్వామివారికి అన్నాభిషేకం చేసి ఆలయాన్ని మూసివేశారు. అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న సింహమండపం వద్ద వండిన అన్నాన్ని కుంభరాశిగా వేశారు. ఆ తర్వాత సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీవేషధారణలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతిని సమర్పించారు. శ్రీశైలంలో జరిగే కుంభోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం భ్రమరాంబికాదేవి అమ్మవారు నిజరూప అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఏడాది కుంభోత్సవం జరిగే రోజున మాత్రమే అమ్మవారు నిజరూప అలంకరణతో దర్శనమివ్వడం ఇక్కడ సంప్రదాయబద్ధంగా వస్తోంది. మిగతా రోజు అమ్మవారు విశేషమైన అలంకరణతో శాంతిస్వరూపిణిగా భక్తులకు దర్శనమిస్తారు. కుంభోత్సవం సందర్భంగా భ్రామరి అమ్మవారి నిజరూప దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. అమ్మవారి నిజరూప దర్శన సమయంలో మల్లికార్జునస్వామి దర్శనాన్ని నిలిపివేశారు.



అమ్మవారికి సమర్పించిన గుమ్మడికాయలు

అమ్మవారికి గుమ్మడికాయలు, అన్నపురాశి సమర్పణ



స్త్రీ వేషధారణలో కుంభహారతి ఇస్తున్న పురుషుడు

29న డోన్‌కు చంద్రబాబు



డోన్‌లో చంద్రబాబు బహిరంగ సభ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

డోన్, ఏప్రిల్ 26: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ నెల 29న డోన్ వస్తున్నారు. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను శుక్రవారం పట్టణంలో కోట్ల తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ లీగల్ సెల్ సీనియర్ న్యాయవాది శ్రీనివాసభట్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున తదితరులు పరిశీలించారు. వెంకటనాయునిపల్లి రోడ్డులో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పాతబస్టాండులో గాంధీ విగ్రహం ముందు జరిగే సభ కూడలిని పరిశీలించారు.

చంద్రబాబు పర్యటన ఇలా..

ఈ నెల 29న సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు చంద్రబాబు డోన్‌కు చేరుకుంటారు. వెంకటనాయునిపల్లె రోడ్డులోని హెలిప్యాడ్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని అక్కడి నుంచి రోడ్‌షో నిర్వహిస్తారు. పాతబస్టాండులో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

ఆలమూరు అధోగతి..!

పట్టించుకోని సీఎం



పాణ్యం, ఏప్రిల్ 26: ఆరేళ్లుగా పంటలు ఎండిపోతున్నాయి.. పట్టించుకోండి అని రైతులు ఎంత మొరపెట్టుకున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం రాలేదు. పాణ్యం మండలంలోని ఆలమూరు గ్రామంలో దాదాపు 300 ఎకరాల పంట భూములు ఎస్సార్బీసీ కాల్వకు గండి కొట్టడంతో నీరు పంటలను ముంచెత్తుతోంది. దీంతో ముంపునకు గురై పంటలు పండించుకోవడానికి వీలు లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామంలోని బాధిత రైతులందరూ రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రికి రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ముఖ్యమంత్రి కంటే ముందుగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టరు, ఆర్డీఓ, ఎంఆర్‌ఓ తదితర అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వంద మంది రైతులు తమ పొలాలను ఆరేళ్లుగా బీడుగా పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదని ఆలమూరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పొలాలు బీడుగా మారుతున్నాయని, పంటలకు నీటిని కేటాయించాలని కోరుతున్నా సీఎం జగన్ పట్టించుకోవడం లేదని పాణ్యం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన విశ్రాంత సైనికుడు సగినేల సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆశా కార్యకర్తలు పోయి వీఆర్వోలు వచ్చే

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 26: ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీఎల్వోలుగా అంగన్‌వాడీ కార్యకర్తలు కీలకపాత్ర పోషించేవారు. గత ఎన్నికల్లో సైతం కార్యకర్తలే పని చేశారు. కానీ ఈ ఎన్నికల్లో వారిని దూరంగా ఉంచి ఆ బాధ్యతలను వీఆర్వోలు, వీఆర్‌ఏలు, సచివాలయ సిబ్బంది స్వీకరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి 18 సంవత్సరాలు నిండిన యువతీయువకుల పేర్లు నమోదు చేసుకోవడంతోపాటు ఎన్నికల పోలింగు రోజున ఓటర్లకు స్లిప్పులు అందజేసే బాధ్యతలను స్వీకరించేవారు. ఈ బాధ్యతలన్నీ నిర్వర్తించిన అంగన్‌వాడీ కార్యకర్తలకు పారితోషికం ఆలస్యంగా చెల్లించినా పని చేసేవారు.

ఈసారి సెక్టోరియల్ అధికారులకు బాధ్యతలు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 26: ఎన్నికల్లో పోలింగు సులభంగా ఉండాలన్న ఆలోచనతో ఎన్నికల కమిషన్ ప్రతి నియోజకవర్గంలోని కొన్ని పోలింగు బూత్‌లను కలిపి రూట్లు, జోన్లుగా విభజించేది. అలాగే వీటికి రూట్, జోన్‌ల అధికారులను నియమించి, ఆయా రూట్లకు, జోన్‌లకు బస్సులను ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఎన్నికల్లో రూట్లు, జోన్‌ల మాటే లేదు. వీటికి బదులుగా సెక్టోరియల్ అధికారులను నియమించి పోలింగు బూత్‌లో జరిగే కార్యక్రమాలు మొదలన్నీ వారే చూసుకోవాల్సిన బాధ్యతలను ఎన్నికల కమిషన్ అప్పగించింది.

ఎన్నికల్లో కొత్త ప్రలోభాలు

రుద్రవరం, ఏప్రిల్ 26 : రాజకీయ నాయకులు కన్ను కౌలు రైతు ఓటరుపై పడింది. మోతుదారి రైతుల నుంచి భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న కౌలు రైతు ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు షరతులు విధిస్తున్నారు. ఓటు వేయాలని లేదంటే తమ భూములు కౌలుకు ఇవ్వడం కుదరదని చెబుతున్నారు. కౌలు రైతులు చేసేదేమీ లేక ఆ భూములు కోల్పోతే ఉపాధికి ఇబ్బందిగా మారుతుందని ఇష్టం లేకపోయినా తల ఊపాల్సి వస్తోంది. ఇష్టం లేకున్నా ఆ పార్టీ కండువా కప్పుకోవాల్సి వస్తోంది.

ఈ సారి పాలన పగ్గాలు మావే..!



టీడీపీ అభ్యర్థి గౌరు చరిత మహిళా రైతు అవతారమెత్తారు. పసుపు కండువాతో కూడిన తలపాగాతోపాటు ఓ చేతిలో చెలకోల, మరో చేత్తో పగ్గాలు.. ఇలా ఎద్దుల బండిపై నుంచి ముందుకు సాగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం గడివేముల మండలంలోని వండుట్ల గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సమకూర్చిన ఎద్దుల బండిపై ఆమె గ్రామంలో కలియతిరిగారు. ఇలా ఆమె ఎద్దుల బండిపై వెళ్తూ గ్రామస్థులను ఆకట్టుకున్నారు. వైసీపీ పాలనలో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని, రైతుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు.

-గడివేముల




నంద్యాల టౌన్, ఏప్రిల్ 26:

రాష్ట్ర రాజకీయాల్లోనే నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి ఓ విలక్షణమైన స్థానం ఉంది. ఈ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు రాజకీయ పార్టీలకు కాకుండా వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వారినే ఎమ్మెల్యేలుగా గెలిపిస్తున్నారు. 1952 నుంచి 2019 వరకు శాసన సభకు 17 సార్లు జరిగిన ఎన్నికల్లో ఏకంగా నాలుగు సార్లు వ్యక్తులకు ప్రాధాన్యత ఇచ్చి స్వతంత్ర అభ్యర్థులను ఎన్నుకున్న ఘనత నంద్యాల నియోజకవర్గానికే దక్కుతుంది.



ఓటరు తీర్పు విలక్షణం



- పార్టీలు కాదు.. వ్యక్తులే ముఖ్యం
- నంద్యాల అసెంబ్లీ రాజకీయం ప్రత్యేకం
- నాలుగు సార్లు స్వతంత్రుల హవా
- 1952 నుంచి 2019 వరకు 17 సార్లు ఎన్నికలు
- ఇప్పటి వరకు ఒక్కరికి కూడా దక్కని హ్యాట్రిక్



ఎక్కువ సార్లు గెలిచిన నేతలు

నంద్యాల శాసన సభ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎం సుబ్బారెడ్డి రెండు సార్లు ఎన్నికయ్యారు. స్వతంత్ర, జనతా అభ్యర్థిగా బొజ్జా వెంకటరెడ్డి రెండు సార్లు ఎన్నికయ్యారు. టీడీపీ అభ్యర్థిగా ఎన్‌ఎండీ ఫరూక్ మూడు సార్లు శాసన సభకు ఎన్నికయ్యారు. శిల్పా మోహన్‌రెడ్డి రెండు సార్లు గెలిచారు.

నవ నందుల కూడలిగా

నల్లమల అటవీ ప్రాంత సమీపంలో నవనందుల కూడలిలో ప్రసిద్ధికెక్కిన నంద్యాల రాజకీయాల్లోనూ దేశస్థాయిలో సంచనల నియోజకవర్గంగా ప్రసిద్ధికెక్కింది. జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఒక్కటైన నంద్యాల పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతల దృష్టి అంతా నంద్యాలపైనే ఉంటుంది. 2009 ఎన్నికలకు ముందు జరిగిన పునర్విభజన వరకు నంద్యాల అసెంబ్లీ పరిధిలోని బండిఆత్మకూరు, మహానంది మండలాలు, నంద్యాల పట్టణంలో ఉన్న నవనందుల కూడలిగా రాజకీయాల్లోనూ ఎంతో ప్రాముఖ్యత ఉండేది. అయితే నియోజకవర్గాల పునర్విభజనలో బండిఆత్మకూరు, మహానందిలోని ఆరు నందులు శ్రీశైలం నియోజక వర్గంలో చేరాయి. దీంతో పట్టణంలోని ప్రథమ నంది, సోమనంది. బ్రహ్మనందీశ్వర స్వాముల క్షేత్రాలు మాత్రమే ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్నాయి. ఆళ్లగడ్డ పరిధిలోని గోస్పాడు మండలాన్ని నంద్యాలలో కలిపినప్పటికీ ఎన్నో ఏళ్ల నుంచి నవనందుల కూడలిగా వెలుగొందుతున్న నంద్యాల ఇప్పటికీ అదే స్థాయి ప్రాముఖ్యతతో రాజకీయాల్లోనూ ప్రసిద్ధికెక్కింది.

స్వతంత్ర అభ్యర్థులను గెలిపించిన ఘనత

1952లో స్వతంత్ర అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి జీ రామిరెడ్డిపై ఎం.సుబ్బారెడ్డి విజయం సాధించారు. 1955లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎం సుబ్బారెడ్డిపై జీ రామిరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1962లో మరోసారి ఎం సుబ్బారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. 1972లో సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే నబీసాహెబ్‌పై స్వతంత్ర అభ్యర్థిగా బొజ్జా వెంకటరెడ్డి పోటీ చేసి గెలుపొందారు. 1978లో తిరిగి నబీసాహెబ్‌పై జనతా అభ్యర్థిగా బొజ్జా వెంకటరెడ్డి గెలిచారు.

నాయకుల వ్యక్తిత్వానికే పెద్దపీట..

నంద్యాల రాజకీయాల్లో రాజకీయ పార్టీలకు కాకుండా, నాయకుల వ్యక్తిత్వానికే ప్రజలు పెద్దపీట వేస్తూ వస్తున్నారు. 1952లో జరిగిన తొలిసారి ఎన్నికల్లోనే ఈ విషయం స్థానిక ప్రజలు రుజువు చేశారు. ఆ ఎన్నికల్లో అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేకుండా ఉన్నప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గోపవరం రామిరెడ్డిని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఎం. సుబ్బారెడ్డి ఓడించారు. ఇదే పంథాలో నాలుగుసార్లు స్వతంత్ర అభ్యర్థులు నంద్యాల నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు. పార్టీలు ఏవైనా వ్యక్తులను బట్టి గెలిపించిన ఘనత కూడా నంద్యాల ప్రజలకు దక్కుతుంది. బొజ్జా వెంకటరెడ్డి 1972లో స్వతంత్ర అభ్యర్థిగా, 78లో జనతా పార్టీ అభ్యర్థిగా గెలుపొందడం ఇందుకు అద్దం పడుతుంది.

ఇద్దరు నేతలకు మంత్రి పదవులు

రాజకీయ ఉద్దండుల ఖిల్లాగా రాజకీయాల్లో నంద్యాల ప్రత్యేకత ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఇద్దరు నేతలకు మాత్రమే మంత్రి పదవులు దక్కాయి. 1985 ఎన్నికల్లో తొలిసారిగా విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టిన ఎన్‌ఎండీ ఫరూక్‌కు అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు క్యాబినెట్‌లో చక్కెర శాఖ మంత్రిగా స్థానం దక్కించుకున్నారు. 1994లో, 99 ఎన్నికల్లో గెలిచిన ఫరూక్‌కు శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా, రాష్ట్ర పురపాలక శాఖ, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పదవులను అలంకరించారు. 2009 ఎన్నికల్లో నంద్యాల నుంచి రెండోసారి ఎన్నికైన శిల్పా మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పదవి దక్కింది. 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన భూమా నాగిరెడ్డి గుండెపోటుతో మరణించడం, 2017లో ఉప ఎన్నికలు జరగడం, భూమా బ్రహ్మనందరెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం వంటి పరిణామాలు జరిగిపోయాయి. సీనియర్ నాయకుడిగా ఉండి ఉప ఎన్నికలో విజయం కోసం కృషి చేసిన ఎన్‌ఎండీ ఫరూక్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి, మండలి చైర్మన్ పదవి దక్కింది. 2018 నవంబరులో మంత్రివర్గ విస్తరణలో ఫరూక్‌కు మరోసారి మంత్రి పదవి లభించింది. రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రిగా 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల వరకు బాధ్యతలను నిర్వర్తించారు.

నంద్యాల నుంచి గెలుపొందిన వారు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థులు	పార్టీ
1952	మల్లు సుబ్బారెడ్డి	స్వతంత్ర
1955	జీరామిరెడి	స్వతంత్ర
1959	జీవెంకటరెడ్డి	కాంగ్రెస్
1962	మల్లు సుబ్బారెడి	స్వతంత్ర
1967	నబీసాహెబ్	కాంగ్రెస్
1972	బొజ్జా వెంకటరెడ్డి	స్వతంత్ర
1978	బొజ్జా వెంకటరెడ్డి	జనత
1983	ఎం.సంజీవరెడ్డి	టీడీపీ
1985	ఎన్‌ఎండీ ఫరూక్	టీడీపీ
1989	వీ.రామనాథ్‌రెడ్డి	కాంగ్రెస్
1994	ఎన్‌ఎండీ ఫరూక్	టీడీపీ
1999	ఎన్‌ఎండీ ఫరూక్	టీడీపీ
2004	శిల్పామోహన్‌రెడ్డి	కాంగ్రెస్
2009	శిల్పా మోహన్‌రెడ్డి	కాంగ్రెస్
2014	భూమా నాగిరెడ్డి	వైసీపీ
2017	భూమా బ్రహ్మనందరెడ్డి	టీడీపీ
2019	శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి	వైసీపీ



చెక్‌పోస్టులో బిందెతో అధికారులకు నీళ్లు

చరిత్రను మలుపు తిప్పిన

ఒక్క ఓటు



ఒక్క ఓటు అని వదిలేస్తే అధికారమే తారుమారు

శిరివెళ్ల, ఏప్రిల్ 26: రాష్ట్రం, దేశంలో సుపరిపాలన జరగాలంటే ప్రజాప్రతినిధులు సమర్థవంతులై ఉండాలి. అలాంటి నాయకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడికి ఉంది. ఒక్కసారి ఓటు వేయకపోతే.. ఐదేళ్ల వరకు అవకాశం లేనట్టే. ఒక్క ఓటుతో ఏమవుతుందిలే అనే నిర్లక్ష్యం వద్దు. ఆ ఒకే ఒక్క ఓటుతోనే ఎన్నో సంచనాలు చోటు చేసుకున్నాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు కూలిపోయాయి. మరెందరికో అధికారాలు దూరమయ్యాయి. చేతికి అంది వస్తాయన్న అవకాశాలు సైతం ఆ ఒక్క ఓటుతోనే చేజారిపోయాయి. అందువల్ల పోలింగ్ కేంద్రానికి వెళ్లి మీ చేతిలోని బ్రహ్మాస్త్రాన్ని సంధించండి. ప్రజాస్వామ్య యజ్ఞంలో భాగస్వాములవండి.

మలుపు తిప్పిన చారిత్రక సందర్భాలివే.. :

- 1714లో ఒక్క ఓటు తేడాతో కింగ్‌జార్జ్-1 ఇంగ్లాడులో అధికారం పీఠం ఎక్కాడు.
- 1776వ సంవత్సరంలో అమెరికాలో ఒకే ఒక్క ఓటు తేడాతో జర్మన్ బదులుగా ఇంగ్లీషు అధికార భాష అయింది.
- 1800లో థామస్ జాఫ్సర్‌సన్, 1824లో జాన్‌క్విన్స్ ఆడమ్స్, 1876లో రూథర్‌ఫర్డ్ హెమ్సలు ఎలక్టోరల్ కాలేజీలో ఒకే ఒక్క ఓటు తేడాతో అమెరికా అధ్యక్షులుగా పదవులను అధిష్ఠించారు.
- 1923 నవంబరు 8న జర్మనీలో నాజీ పార్టీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఒకే ఒక్క ఓటు తేడాతో అడాల్ఫ్ హిట్లర్ ప్రత్యర్థి ఓడిపోయాడు. లేదంటే ప్రపంచ చరిత్ర వేరుగా ఉండేదేమో..!
- 1999లో కేంద్రంలో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఒక్క ఓటు తేడాతో కూలిపోయింది.
- 2004లో కర్ణాటకలోని సంతెమరహళ్లి నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఏఆర్ కృష్ణమూర్తి ఒక్క ఓటుతో ఎమ్మెల్యే సీటును కోల్పోయారు.
- 2008 రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు సీపీ జోషి ఒక్క ఓటు తేడాతో ఓడిపోయాడు. ఆయన గెలిస్తే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేవారు.
- ఒక్క ఓటు తేడాతో ఆంగ్లంపై హిందీ భాష గెలిచి మన దేశ జాతీయ బాషగా గుర్తింపు పొందింది.
- మీకు ఉన్న ఒక్క ఓటు కూడా అంతటి ప్రభావం చూపుతుందేమో.. నీ ఓటే సంచలనం సృష్టించవచ్చు. అభివృద్ధి చేసే వారికి ఓటు వేసి మీ భవిష్యత్తును మీరే మార్చుకోండి.


గడివేముల, ఏప్రిల్ 26: ఎన్నికల హీట్ పెరిగింది. గెలుపు కోసం ఆయా పార్టీల అభ్యర్థులు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలు, భయాందోళనకు గురి చేస్తున్నారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఎన్నికలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తూ ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు అధికారులను బృందాలుగా నియమించింది. అయితే క్షేత్రస్థాయిలో ఈ బృందాలు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో మండలంలో ఎన్నికల నియమావళి పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

- **చూసీచూడనట్లుగా:** అభ్యర్థుల ఎన్నికల ప్రచారాలు, సభలు, ర్యాలీలపై వీఎస్‌టీ బృందం, మండలంలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు ఎంసీసీ బృందం, ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకుండా చర్యలు తీసుకునేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఎన్నికల సంఘం నియమించింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి నెల

నిద్రపోతున్న నిఘా..

- గ్రామాల్లో పర్యటించని ఎన్నికల అధికారుల బృందాలు
- పూర్తిస్థాయిలో అమలు కాని నియమావళి

రోజులు గడిచినా ఎన్నికల నియమావళి పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని బిలకలగూడురు, గని గ్రామాల్లో వైసీపీ రంగులతో ఆ పార్టీ జెండా దిమ్మెలు దర్శనమిస్తున్నాయి. మంచాలకట్ట గ్రామంలో తాగునీటి ట్యాంకుకు వేసిన వైసీపీ రంగులను ఇంకా తొలగించలేదు. ఇవేగాక మండలంలో తెలంగాణ నుంచి భారీ స్థాయిలో మద్యం తరలించి విక్రయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు ఉన్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ బృందాల వాహనాలకు అరకొరగా డీజిల్ కేటాయించడంతో పూర్తిగా తనిఖీలు చేపట్ట లేకపోతున్నామని అధికారులు అంటున్నట్లు వినికిడి.



బిలకలగూడురులో వైసీపీ రంగులో ఉన్న జెండా దిమ్మె

- **చినిగిపోయిన పరదాలు.. బిందెలతో నీళ్లు**

ఎన్నికల్లో డబ్బు, మద్యం ఇతర ప్రాంతాలకు తరలించకుండా చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీ చేసేందుకు ఎన్నికల సంఘం ఎస్ఎస్‌టీని ఏర్పాటు చేసింది. ఈ బృందం చెక్‌పోస్టుల వద్ద ఉంటూ వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేస్తుంది. అయితే ఈ బృందం ఉండేందుకు సరైన మౌలిక వసతులు ఏర్పాటు చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరదాలు కూడా చినిగిపోవడంతో ఎండ తీవ్రతతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తాగేందుకు బిందెలతో నీరు తెచ్చి పెడుతున్నారు. ఎండకు వేడెక్కిన నీరు తాగడానికి ఇబ్బందిగా ఉందని ఆవేదన చెందుతున్నారు.

పూర్తి స్థాయిలో డీజిల్ ఇస్తున్నాం: జవానుల్లాఖాన్, తహసీల్దార్

ఎన్నికల విధుల్లో పాల్గొనే బృందాల వాహనాలకు పూర్తిస్థాయిలో డీజిల్ పంపిణీ చేస్తున్నాం. అలాగే చెక్‌పోస్టుల వద్ద ఎస్ఎస్‌టీ టీమ్‌కు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

పెద్దల మాట

అప్పట్లో మాట ఇచ్చిన వారికే ఓటు



రుద్రవరం, ఏప్రిల్ 26 : అప్పట్లో మాట ఇచ్చిన వారికే ఓటు వేసేవారం. 86 ఏళ్ల వయస్సులో 2024లో మరోసారి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నాను. అప్పట్లో ప్రచారం తక్కువే. గ్రామానికి ఒక్కరు వచ్చేవారు చెప్పి వెళ్లేవారు. అప్పట్లో ఎన్నికల ఘర్షణలు లేవు, మనస్పర్థలు లేవు. నడుచుకుంటూ వెళ్లి పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి వచ్చేవారం. ఇంత ఆర్భాటం అప్పట్లో లేదు.

- పోలబోయిన వెంకటేశ్వర్లు

ఆ రోజుల్లో డబ్బు ప్రభావం లేదు...



ఆలూరు, ఏప్రిల్ 26: నేను 14 సార్లు ఎన్నికల్లో ఓటు వేశాను. నాకు ఇప్పుడు 90 ఏళ్లు. మరోసారి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నా. ఇప్పటిలాగా అప్పట్లో డబ్బులు ఇచ్చేవారు కాదు. ఎన్నికలు వస్తే పోటీ చేసేవారు గుడి దగ్గరకు వచ్చి మా గ్రామానికి కొన్ని హామీలు ఇచ్చేవారు. మేమంతా ఎవరికైతే మాట ఇచ్చామో వారికే ఓటు వేసే వాళ్లం. అప్పుడు ఇంత మంది అభ్యర్థులు కూడా ఉండే వారు కాదు. ఇప్పుడు ఎవరెవరో వస్తున్నారు. కొత్త కొత్త పార్టీల పేర్లు చెప్పి ఓట్లు అడుగుతున్నారు.

-కనకమ్మ, ఆలూరు

నడిచి వెళ్లి ఓటు వేశాం



రుద్రవరం, ఏప్రిల్ 26 : మా ఊరిలో పోలింగ్ కేంద్రం లేదు. శ్రీరంగాపురం టి.తుమ్మలకొట్టాల గ్రామానికి వెళ్లి అప్పట్లో ఓటు వేసి వచ్చాం. ప్రస్తుతం మా ఊరిలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. 82 ఏళ్ల వయస్సులో మరోసారి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నా. పూర్వం ప్రచారం అనేది ఇంత జోరుగా ఉండేది కాదు. ఓటు వేయమని అడిగే వారు. వెళ్లి వేసే వారం. అబ్బో.. ఇప్పుడు మైకులు, మేళాలు, తాళాలు, కరపత్రాలు ఇలా ఎన్నో. అప్పట్లో ఇవేమీ పల్లెల్లో కనిపించేవి కావు.


ఎన్ని పతకాలు వస్తే ఏం లాభం..?



నిరుద్యోగి వేదన

కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 26: పులకుర్తి గ్రామానికి చెందిన జి.మహేష్‌కు పీఈటీ ఉద్యోగం సాధించాలని కల. ఈ మేరకు పాఠశాలలో పీఈటీ రవీంద్ర సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకు సాగాడు. ఆటల పోటీల్లో పాల్గొని పలు ప్రశంసాపత్రాలు, పతకాలు పొందాడు. 2011 నుంచి 2021 మధ్య కాలంలో మహేష్ తన ఇంటర్, డిగ్రీ, బీపీఈడీ, ఎంపీఈడీ విద్యాభ్యాసం వరకు ఆటల ప్రస్తానాన్ని మరచిపోలేదు. 2015-18 మధ్య డిగ్రీ పూర్తయిన పిదప మరో ఆలోచన లేకుండా బీపీఈడీకి దరఖాస్తు చేసుకున్నాడు. అలా ఎస్వీయూలో 2018-20 మధ్య బీపీఈడీ, 2020-22 వరకు ఎస్కేయూలో ఎంపీఈడీ పూర్తి చేశాడు. బీపీఈడీ పూర్తయినప్పటి నుంచే డీఎస్సీ కోసం ప్రిపరేషన్ మొదలు పెట్టాడు. ఎంపీఈడీ పూర్తయ్యాక కోడుమూరులో ఓ అద్దె గదిలో ఉంటూ డీఎస్సీ కోసం సన్నద్ధమవుతున్నాడు. అయితే వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేస్తుందనే ఆశ ఆవిరైంది. ఇటీవల ఎన్నికల ముందు విడుదల చేసిన డీఎస్సీ కూడా నిర్వహించలేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని మహేష్ ఆవేదన చెందాడు.

కోవర్టులు..!



ఆదోని, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల వేళ రాజకీయ కోవర్టులు రంగప్రవేశం చేశారు. ప్రత్యర్థి పార్టీలో ఏం జరుగుతుందో, వారి కదలికలు ఎలా ఉన్నాయో తెలుసుకుంటున్నారు. ఎవరెవరిని కలుస్తున్నారు. వారి వ్యూహాలేమిటనే విషయాలను ఏ రోజుకారోజు అధినాయకులకు చేరవేయడమే వీరి పని. ప్రతిఫలంగా ముందస్తుగా మాట్లాడుకున్న మేరకు నేతల నుంచి తాయిలాలు అందుకుంటున్నారు. ఎన్నికలకు మరో 24 రోజుల సమయం ఉంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఆయా నియోజకవర్గాల్లో వివిధ పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈసారి రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎత్తుకు పైఎత్తు వేస్తూ ముందుకు సాగుతున్నాయి. అభ్యర్థులు వ్యూహాలు రచిస్తూ ముందుకెళ్తున్నారు. ఆయా నాయకుల ఆలోచనలు, వ్యూహాలు తెలుసుకునేందుకు పార్టీలు కోవర్టులపై ఆధారపడుతున్నాయి. వీరు పార్టీలోనే ఉంటూ నమ్మకంగా వ్యవహరిస్తూ సమాచారాన్ని చేరవేరుస్తున్నారు. ఆ ప్రకారం ప్రత్యర్థులు అప్రమత్తమై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

తెలిసిపోతున్న వ్యూహాలు ..

జిల్లాలోని ఆయా నియోజకవర్గల్లో కోవర్టులు పదుల సంఖ్యలో ఉన్నారు. ప్రధాన పార్టీల్లో నమ్మకంగా మెసులుతూనే ప్రత్యర్థులకు ఇక్కడి విషయాలను పూసగుచ్చినట్లు వివరిస్తున్నారు. వేగుల రంగప్రవేశంతో రాజకీయ పార్టీల వ్యూహాలు చెదిరిపోతున్నాయి. రెండు, మూడు రోజులుగా కష్టపడి రచించిన వ్యూహం అమలు చేయడానికి ముందే ప్రత్యర్థి పార్టీల వారికి తెలుస్తుండటంతో అవాక్క

వ్య...
తె...
న్నారు. ఈ తాజా పరిణామాలతో పార్టీలో ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో అని తేల్చుకోలేకపోతున్నారు. ఇటీవల ప్రతిపక్ష పార్టీలో ఉన్న నేతలు ఒక్కసారిగా పార్టీని మీడుతున్నట్లు సమాచారం రావడంతో ఆ నేతను బుజ్జగించి తిరిగి పార్టీలోనే ఉండే విధంగా ఒప్పించారు.

● ఫోన్ సంభాషణలపై..

ఎన్నికల వేళ ముఖ్యమైన నాయకులు ద్వితీయ స్థాయి నేతలతో ఫోన్లో మాట్లాడి కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఏం చేయాలో దిశా నిర్దేశం చేసేస్తున్నారు. ఎన్నికల వేళ అనుసరించే విధివిధానాలు గంపగుత్తంగా ఓట్లను కొనుగోలు చేయడానికి ఎలాంటి తాయిళలు అందజేయాలి, వాటిని సమకూర్చుకోవడం ఎలాగో వివరిస్తున్నారు. విషయాలు బయటకి పొక్కవులే అనుకునేలోపే పరిసరాల్లోనే తిరుగుతున్న వేగులు ఏ సమయంలో ఎవరితో ఏం మాట్లాడారనే విషయాన్ని అవతలి నేతకు చేరవేస్తున్నారు. దీంతో అప్రమత్తమైన అవతలి వారు తాయిలాలు ఇవ్వకపోయినా గంపగుత్త

ఓట
ర్లకు ముఖ్యులుగా భావిస్తున్న వారి వద్దకు నేరుగా వెళ్లి విషయాన్ని చెప్పి వస్తున్నారు. దీంతో తమకు ఫలానా నాయకుని నుంచి హామీ అభించిందని సంబరపడి పోతున్నారు.

తలలు పట్టుకుంటున్న అభ్యర్థులు

ఎన్నికల వేళ వేగులు రాజకీయ పార్టీలకు గుబులు పుట్టిస్తుండటంతో వీరితో వేగేదెలా అంటూ అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సొంత పార్టీ నేతలతో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతూ వేగులుగా మారిన నాయకులు రాత్రి కాగానే ప్రత్యర్థి పార్టీలో ముఖ్యమైన నాయకులతో భేటీ అవుతున్నారు. అక్కడ మందు, విందుతో హంగామా చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలోనే పాల్గొంటూ వారి వ్యూహాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని ప్రత్యర్థి వారికి చేరవేస్తుండటంతో అభ్యర్థుల్లో భయం నెలకొంది. వివిధ పార్టీలో ఉన్న కోవర్టుల కారణంగా వీరితో ఏ పార్టీకి నష్టం జరుగుతుందో ఎవరికి లాభం జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

● 50 తిరస్కరణ.. 232 ఆమోదం

● ఎంపీ అభ్యర్థుల నామినేషన్లలో 7 తిరస్కరణ



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నిక నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. జిల్లాలో ఎంపీ సహా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాఖలైన వాటిలో 50 నామినేషన్లు తిరస్కరించామని, 232 నామినేషన్లు ఆమోదించామని ఎన్నికల అధికారులు (ఆర్‌ఓ) పేర్కొన్నారు. కర్నూలు పార్లమెంట్, కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాలకు 184 మంది అభ్యర్థులు 282 నామినేషన్లు దాఖలు చేశారు. కర్నూలు పార్లమెంట్ స్థానానికి 27 మంది అభ్యర్థులు 41 నామినేషన్లు వేయగా.. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 157 మంది అభ్యర్థులు 241 నామినేషన్లు వేశారు. శుక్రవారం రిటర్నింగ్ అధికారులు స్క్రూటినీ నిర్వహించారు. నిబంధనలు ప్రకారం నామినేషన్ పత్రాలు పూరించకపోవడం, అభ్యర్థులను బలపరిచిన వ్యక్తుల ఓటర్ల జాబితాలో క్రమ సంఖ్యలు తప్పుగా వేయడం, ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థులుగా నామినేషన్లు వేసి బీ-ఫారం ఇవ్వకపోవడం.. వంటి కారణాలతో 50 నామినేషన్లను తిరస్కరించామని, 232 నామినేషన్లు ఆమోదించామని ఆర్‌ఓలు తెలిపారు. కర్నూలు పార్లమెంట్ స్థానానికి 41 నామినేషన్లు రాగా.. 7 తిరస్కరణకు గురయ్యాయి. 34 నామినేషన్లను ఆమోదించారు. ప్రధాన పార్టీన టీడీపీ, వైసీపీ అభ్యర్థులు తమతో పాటు కుటుంబ సభ్యులతో పార్టీ అభ్యర్థులుగా డమ్మి నామినేషన్లు వేయించారు. పార్టీ బీ-ఫారాలు ఇవ్వకపోవడంతో మెజార్టీగా అలాంటి నామినేషన్లను తిరస్కరించినట్లు తెలుస్తోంది.


● నియోజకవర్గాల వారిగా వచ్చిన నామినేషన్లు, అభ్యర్థులు:

నియోజకవర్గం	నామినేషన్లు	తిరస్కరణ	ఆమోదం
కర్నూలు పార్లమెంట్	41	7	34
కర్నూలు అసెంబ్లీ	56	13	43
కోడుమూరు (ఎస్సీ)	31	5	26
ఎమ్మిగనూరు	28	5	23
మంత్రాలయం	17	2	15
ఆదోని	23	4	19
ఆలూరు	25	2	23
పత్తికొండ	24	4	20
పాణ్యం	37	8	29
మొత్తం	282	50	232

గోనెగండ్ల ఓటర్లే కీలకం

ఇక్కడ ఎవరికి మెజార్టీ వస్తే వారు గెలిచినట్టే..!

గోనెగండ్ల, ఏప్రిల్ 26: ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఎవరు గెలవాలన్నా గోనెగండ్ల మండల ఓటర్లు కీలకమవుతున్నారు. పునర్విభజనలో గోనెగండ్ల పత్తికొండ నుంచి ఎమ్మిగనూరుకు 2009లో చేరింది. గోనెగండ్ల నుంచి ఎవరికి మెజార్టీ వస్తే వారే అప్పట్లో పత్తికొండ ఎమ్మెల్యేగా గెలుపొందేవారు. 1989లో పాటిల్ శేషిరెడ్డి,(కాంగ్రెస్), 1994, 1999, 2004లో ఎస్వీ సుబ్బారెడ్డి(టీడీపీ) నుంచి గోనెగండ్ల మెజార్టీ ఆయా పార్టీలకు రావడంతోనే గెలుపొందారు. అప్పట్లో అభ్యర్థుల గెలుపోటములలో గోనెగండ్ల మండల ఓటర్లు కీలకమయ్యారు. అయితే 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా గోనెగండ్ల మండలం పత్తికొండ నుంచి ఎమ్మిగనూరులో చేరింది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరురూరల్, ఎమ్మిగనూరు పట్టణం ఉన్నాయి. అందులో ఎమ్మిగనూరు పట్టణం తరువాత అత్యధికంగా ఓట్లు గోనెగండ్ల మండలంలోనే ఉన్నాయి. గోనెగండ్లలో 57922 ఓట్లు ఉన్నాయి. అందులో పురుషులు 29,061, స్త్రీలు 28,859, కాగా ఓబీసీలు 40,561. ఎస్సీలు 12,617. ఎస్టీలు 200. ఓసీలు 4,541 ఓట్లు ఉన్నాయి. ఈ మండలంలో ఎక్కువ గా బీసీ ఓట్లు ఉన్న మండలం. గోనెగండ్లలో 57,992 ఓట్లు, నందవరంలో 46,466 ఓట్లు, ఎమ్మిగనూరుటౌన్, రూరల్ కలిపి 1,38,679 ఓట్లు ఉన్నాయి. అయితే 2009 ఎన్నికల నుంచి గోనెగండ్ల ఓటర్లు ఎమ్మిగనూరు నియోజక వర్గం కు చెందిన ఎమ్మెల్యేకు ఓట్లు వేస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 2009లో కాంగ్రెస్ అభ్యర్థి చెన్నకేశవరెడ్డికి గోనెగండ్ల మండలం నుంచి 2500 ఓట్ల మెజార్టీ వచ్చింది ఆ మెజార్టీ తోనే ఆయన అప్పట్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 2012లో ఉప ఎన్నికలు వచ్చాయి అందులో వైసీపీ తరుపున చెన్నకేశవరెడ్డి గెలుపొందారు. అందులో గోనెగండ్ల మండలం నుంచి 15000 మెజార్టీ వచ్చింది. అయితే చెన్నకేశవరెడ్డి 25వేల మెజార్టీతో గెలుపొందారు. గెలుపులో గోనెగండ్ల కీలక పాత్రపోషించింది. ఇక 2014 లో టీడీపీ నుంచి బీవీ జయనాగేశ్వరెడ్డి, వైసీపీ నుంచి చెన్నకేశవరెడ్డి కుమారుడు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి పోటీ చేశారు. అయితే గోనెగండ్ల మండలం నుంచి టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డికి 1525 ఓట్ల మోజార్టీ వచ్చింది ఇక బీవీ 14500 మెజార్టీ తో గెలుపొందారు. ఇక 2019లో టీడీపీ నుంచి బీవీ జయనాగేశ్వరెడ్డి, వైసీపీ నుంచి చెన్నకేశవరెడ్డి పోటీ చేశారు. పోటీలో చెన్నకేశవరెడ్డి 25వేల మేజార్టీతో గెలుపొందారు. ఆయనకు గోనెగండ్ల నుంచి 12500 మెజార్టీ వచ్చింది. ప్రతి ఎన్నికలో నాడు పత్తికొండ నేడు ఎమ్మిగనూరులో గోనెగండ్ల మండలం నుంచి ఎవ్వరికి మోజార్టీ వస్తే వారే ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా గెలుస్తున్నారు. ఈ ఎన్నికల్లో గోనెగండ్ల ఓటర్లు ఎవరికి మొగ్గు చూపుతారో వేచి చూడాల్సిందే. అయితే పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజక వర్గాల్లోని నాయకులకు గోనెగండ్ల ఓటర్ల మనస్థత్వం ఇప్పటికీ అంతుచిక్కలేదనేది వాస్తవం. అయితే అనేక మంది రాజకీయ నాయకులు తమకు తెలిసినట్లు ఉపన్యాసాలు ఇస్తారే గాని గోనెగండ్ల ఓటర్లు ప్రతిసారి ఎన్నికల్లో తమదైన పద్ధతిలో తీర్పు ఇస్తునే ఉన్నారు.



1957లో తొలి సార్వత్రిక ఎన్నికల సమరం



శిరివెళ్ల, ఏప్రిల్ 26 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం అనంతరం 1957, ఫిబ్రవరి 24వ తేదీ నుంచి మార్చి 14 వరకు తొలి సార్వత్రిక ఎన్నికల సమరం జరిగింది. అప్పుడు రాష్ట్రంలో 55,61,345 మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా 36,03,585 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇప్పుడు ఈ సంఖ్య రాష్ట్రంలోని ఒక జిల్లా ఓటర్లతో సమానం. 1957 తొలి సార్వత్రిక ఎన్నికల సమహారం తెలుసుకుందాం.

● 1957లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 85 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

● మొత్తం 85 నియోజకవర్గాలలో 18 స్థానాలు ఎస్సీలకు, రెండు స్థానాలు ఎస్టీలకు కేటాయించారు.

● రాష్ట్ర వ్యాప్తంగా 47.67 పోలింగ్ శాతం నమోదైంది.

● కాంగ్రెస్‌కు 47.38 శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రజా సోషలిస్ట్ పార్టీకి 5.65 శాతం, భారతీయ జన సంఘ్‌కు కేవలం 0.16 శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రాంతీయ పార్టీ పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు 36.46 శాతం ఓట్లు వచ్చాయి.

● మొదటి అసెంబ్లీ నియోజకవర్గంగా కల్వకుర్తి, చివరి అసెంబ్లీ నియోజకవర్గంగా దేవరకొండ ఉండేవి.

● రాష్ట్ర వ్యాప్తంగా 493 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. వాటిలో 174 తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన వాటిలో ఒక్కరు కూడా తమ నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదు.

● పోటీ చేసిన 319 మంది అభ్యర్థులలో 81 మంది డిపాజిట్లు కోల్పోయారు.

● రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది మహిళలు పోటీ చేయగా.. వారిలో ఏడుగురు విజయం సాధించారు.

● మూడు నియోజకవర్గాల్లో ఒక్కొక్క అభ్యర్థి మాత్రమే ఎన్నికల బరిలో ఉండడంతో వారు ఏకగ్రీవంగా శాసన సభ్యులయ్యారు.

● 18 నియోజకవర్గాల్లో ఇద్దరు చొప్పున అభ్యర్థులు పోటీ చేశారు. 25 స్థానాల్లో ముగ్గురు చొప్పున, 21 స్థానాల్లో నలుగురు చొప్పున, మూడు స్థానాల్లో ఐదుగురు చొప్పున, 15 స్థానాలలో ఆరు నుంచి పది మంది ఎన్నికల బరిలో పోటీ చేశారు.

● ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లా



హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి అత్యధికంగా పది మంది అభ్యర్థులు పోటీ చేశారు.

డామిట్.. కథ అడ్డం తిరిగింది

● బెడిసి కొట్టిన వైసీపీ వ్యూహం

● రాజీనామాకు ఒప్పుకోని వలంటీర్లు

● చంద్రబాబు భరోసాతో తిరగబడుతున్న వైనం

● కక్కలేక..మింగలేకపోతున్న అధికార పార్టీ నేతలు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 26: ఇంతకాలం ప్రజలకు, ప్రభుత్వానికి వలంటీర్లు వారధులని ఏలినవారు సుభాషితాలు చెప్పారు. లోగుట్టు ఎన్నికల వేళ బైటపడింది. ఇల్లిల్లూ తిరిగి ప్రజలకు సేవ చేయాలని పురమాయించినవాళ్లే ఇప్పుడు ఉద్యోగాలకు రాజీనామా చేసి ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని వైసీపీకి ఓట్లు వేయించాలని అధికారపార్టీ అదేశించింది. దీంతో వలంటీర్లు తిరగబడ్డారు. ఐదేళ్ల తమ సేవలు వినియోగించుకుని, ఇప్పుడు రాజీనామా చేయమంటారా? అని వైసీపీ నేతలపై మండిపడుతున్నారు.



పని చేయని రాజీనామా అస్త్రం

ఎన్నికల కమిషన్ జోక్యంతో వలంటీర్లంతా ఎన్నికల విధుల్లోనే కాదు..పించన్ల పంపిణీకి కూడా దూరంగా ఉన్నారు. అయినా వైసీపీ నాయకులు వలంటీర్ల సేవలను వినియోగించుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అవకాశం ఉన్న అన్ని దారులు మూసుకోవడంతో చివరకు రాజీనామా అస్త్రాన్ని తెరపైకి తెచ్చారు. అప్పటికే కొందరు రాజీనామా చేసి ఎన్నికల విధుల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. దీంతో మోడల్ కోడ్ కాండక్ట్ రూపంలో కొందరు వలంటీర్లను విధుల నుంచి తొలగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

●చంద్రబాబు భరోసానే తిరస్కరణకు కారణమా..!

ఈ పరిస్థితుల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు.. తాము అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తూ గౌరవ వేతనం రూ.10 వేల ఇస్తామని ప్రకటించారు. దీంతో మొన్నటి దాకా వైసీపీకి వీరాభిమానులుగా ఉన్న వలంటీర్లు ప్రభుత్వంపై తిరగబడుతున్నారు. దీనిని పసిగట్టిన స్థానిక వైసీపీ నాయకులు వలంటీర్లపై వారం రోజులుగా ఒత్తిడి మొదలుపెట్టారు. వీరితో రహస్య సమావేశాలు ఏర్పాటు చేసి తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరింత లబ్ధి చేకూరుస్తామని ఆశ చూపుతున్నారు. వారి మాటలు, హామీలు లెక్కచేయని చాలా మంది వలంటీర్లు టీడీపీ అధికారంలోకి వస్తే తమకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెబుతున్నారు.

● నగర పాలక సంస్థ పరిధిలో 2071 మంది వలంటీర్లు...


నగర పాలక సంస్థ పరిధిలో 52 వార్డులు ఉన్నాయి. కర్నూలు అసెంబ్లీ పరిధిలో 33, పాణ్యం అసెంబ్లీ పరిధిలో 16, కోడుమూరు అసెంబ్లీ పరిధిలో 3 వార్డులు ఉన్నాయి. మూడు నియోజకవర్గాలకు సంబంధించి 133 సచివాలయాల పరిధిలో 2071 మంది వలంటీర్లు సేవలు అందించేవారు. ఎన్నికల కమిషన్ జోక్యంతో ప్రస్తుతం వలంటీర్లు ఎవ్వరూ సేవలు అందించడం లేదు. ఎన్నికల విధుల్లో పాల్గొన్నారని నలుగురు వలంటీర్లను విధులను తొలగించారు. 9 మంది రాజీనామా చేశారు.

●పని చేయని అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు


ఈ దృష్ట్యా అధికార పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు రాజీనామా చేయాలని వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే తమకు 35 ఏళ్లు దాటిపోయాయని, ఇప్పుడు రాజీనామా చేస్తే తరువాత తమ పరిస్థితి ఏమిటని వలంటీర్లు వైసీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. వయసు దాటిన తమకు ఎవరు ఉద్యోగం ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందనే గ్యారంటీ లేనందు వల్ల ఎన్నికల కమిషన్ ఆదేశాలను కాదనలేకపోతున్నామని, వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేమని తెగేసి చెబుతున్నారు. రాజీనామాలు చేయకుండా, ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండ దూరంగా ఉంటున్నారు. దీంతో వైసీపీ నాయకులు కక్కలేక, మింగలేక ఇబ్బందిపడుతున్నారు.

రెండు సార్లు గెలిస్తే మూడోసారి ఓడినట్టే..!

ఆదోనిలో ఇదో రకమైన సెంటిమెంట్



హల్వీ సత్యనారాయణ



రాచోటి రామయ్య

ఆదోని టౌన్, ఏప్రిల్ 26: ఆదోని అసెంబ్లీకి ఇంతవరకు జరిగిన ఎన్నికల్లో ఏ ఎమ్మెల్యే కూడా వరుసగా మూడు సార్లు విజయం సాధించిన దాఖలాల్లేవు. రెండు సార్లు వరుసగా గెలిచిన వారు మూడోసారి గెలిచిన సందర్భం కాలేదు.

● హెచ్ సత్యనారాయణ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) 1972లో సీ శంకర్ రావు (ఇండిపెండెంట్) అనే అభ్యర్థిపై 11,086 ఓట్ల మెజారిటీతో మొదటిసారి విజయం సాధించారు. తిరిగి ఈయన 1978లో ఐఎన్‌సీ(సీ) పార్టీ అభ్యర్థిగా హెచ్ సీతారామిరెడ్డి (ఐఎన్‌సీ) పై పోటీ చేసి 12,378 ఓట్ల అధిక్యతతో గెలిచారు. ఇక వరుసగా మూడోసారి జరిగిన అసెంబ్లీ పోటీలలో ఇండిపెండెంట్ అభ్యర్థి ఎన్ ప్రకాష్ జైన్ చేతిలో 18,855 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

● రాచోటి రామయ్య (కాంగ్రెస్) 1985లో జరిగిన ఎన్నికల్లో పాండురంగారావు (టీడీపీ)పై పోటీ చేసి 10,053 ఓట్ల మెజారిటీతో గెలిచారు. తిరిగి 1989లో కొంకా మీనాక్షినాయుడు (టీడీపీ)పై పోటీ చేసి 9,069 మెజారిటీతో గెలిచారు. మూడోసారి 1994లో కొంకా మీనాక్షినాయుడు చేతిలో 16,581 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

● మీనాక్షినాయుడు (టీడీపీ) 1994లో జరిగిన పోటీలో రాచోటి రామయ్య (కాంగ్రెస్)పై 16,581 ఓట్ల మెజారిటీతో గెలిచారు. రెండోసారి 1999లో కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి (కాంగ్రెస్)పై 14,428 ఓట్ల అధిక్యత సాధించి గెలిచారు. తిరిగి మూడోసారి పోటీ చేయడానికి అవకాశం లభించకపోవడంతో రెండు వరుస విజయాలతోనే సరిపుచ్చుకునేవారు.

ఆ రోజుల్లో అలా...

పప్పులు, బొరుగులు పంచేవారు



మహానంది: ఆ రోజుల్లో నాయకులు ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో పర్యటించేటప్పుడు పప్పులు, బొరుగులు పంచేవారు. ముందు కార్యకర్తలు ఒక సంచి చేత పట్టుకొని ముందుకు వెళ్తుంటే... చిన్నతనం కాబట్టి వారి వెంట మేము వెళ్లేవాళ్లం. ఇప్పటికి, అప్పటికీ ఎన్నికల ప్రచారం పూర్తిగా మారిపోయింది. కాలక్రమేనా ఎన్నికల ప్రచారంలో మార్పు వచ్చింది. కరెన్సీ నోట్లు, మద్యం ఇస్తామంటేనే ప్రచారంలో పాల్గొనే రోజులు వచ్చాయి.

-పక్కీరయ్య యాదవ్, గాజులపల్లి

ముగిసిన నామినేషన్ల పరిశీలన..!

● నంద్యాల పార్లమెంటుకు 35 మంది

నంద్యాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులకు నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి వివరాలు సరిగా లేని అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, అన్ని వివరాలు సక్రమంగా ఉన్న అభ్యర్థుల నామినేషన్లను అధికారులు ఆమోదించారు. నంద్యాల పార్లమెంటుకు సంబంధించి 35 నామినేషన్లకు ఆమోదం లభించగా, 5 తిరస్కరణకు గురయ్యాయి. ఇక నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 31 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందగా, 10 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించి ఆమోదించిన నామినేషన్ల సంఖ్య 28 కాగా, తిరస్కరణకు గురైనవి 5 ఉన్నాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గానికి సంబంధించి 19 మంది నామినేషన్లు ఆమోదం పొందగా, 2 తిరస్కరణకు గురయ్యాయి. శ్రీశైలం నియోజకవర్గానికి సంబంధించి 19 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు ఆమోదించగా, ఐదింటిని తిరస్కరించారు. అలాగే డోన్ నియోజకవర్గానికి సంబంధించి 21 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం లభించగా, రెండింటిని అధికారులు తిరస్కరించారు. నందికొట్కూరు నియోజకవర్గానికి సంబంధించి 21 నామినేషన్లకు ఆమోదం లభించగా, 14 నామినేషన్లను తిరస్కరణకు గురయ్యాయి.

పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల వివరాలు

నియోజకవర్గం	ఆమోదం	తిర్కరణ
నంద్యాల పార్లమెంటు	35	6
నంద్యాల అసెంబ్లీ	31	10
బనగానపల్లె	28	5
నందికొట్కూరు	21	14
ఆళ్ళగడ్డ	19	2
డోన్	21	2
శ్రీశైలం	19	5
మొత్తం	139	38

నామినేషన్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

అభివృద్ధిని గాలికొదిలేసిన జగన్

● టీడీపీ నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్



సాంబవరంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నంద్యాల అభ్యర్థి ఫరూక్

గోస్పాడు, ఏప్రిల్ 26: ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధిని గాలికి వదిలేసి అవినీతి పాలన సాగించారని నంద్యాల టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ ఆరోపించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా శుక్రవారం సాంబవరం గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక, మద్యం, మట్టి, డ్రగ్స్ మాఫియాతో వ్యవస్థలన్నీ నిర్వీర్యమైపోయాయని ఆరోపించారు. ఎన్ఎండీ ఫయాజ్, మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ రామగోపాల్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, సోమా మద్దిలేటి రెడ్డి, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, వీర సింహారెడ్డి, హుసేని, పేరయ్యా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల (నూనెపల్లె): ఎమ్మెల్యే శిల్పా రవి నివశిస్తున్న వార్డులోనే ఎన్నో సమస్యలు ప్రజలు తమకు చెప్పుకున్నారని, అదే ఆయన పాలనకు నిదర్శనం అని నంద్యాల టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం నంద్యాలలోని 36 వార్డులో ఫరూక్‌తో పాటు టీడీపీ రాష్ట్రకార్యదర్శి, ప్రముఖ న్యాయవాది తులసిరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ వార్డు పర్యటన చేశారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చేది కూటమి ప్రభుత్వమే: బైరెడ్డి



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 26: దేశంలో, రాష్ట్రంలో వచ్చేది కూటమి ప్రభుత్వమేనని, చంద్రబాబు సీఎం కావడం ఖాయమని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాలలోని టీడీపీ ఎంపీ ఎన్నికల కార్యాలయంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ నాయకులు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. టీడీపీ మానిఫెస్టో ఆరు గ్యారంటీ పథకాలు పోస్టర్లను విడుదల చేశారు. టీడీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు ప్రసాదరావు, రాజేష్, నరశింహులు పాల్గొన్నారు.

● నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరికి రాయలసీమ స్టీరింగ్ కమిటీ మద్దతు తెలపింది. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నంద్యాలలోని ఆమెను కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కడప, కర్నూలు స్టీరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు టీడీపీ భారీ బహిరంగ సభ



మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్ లాల్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 26: నంద్యాల లోని బాలాజీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 గంటలకు టీడీపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు, టీడీపీ నాయకుడు, స్వతంత్ర కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్ లాల్ తెలిపారు. శుక్రవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభకు నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, నంద్యాల అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, స్థానికంగా ఉన్న టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, బీజేపీ. జనసేనతో పాటు అన్ని సామాజిక వర్గాలతో సభను నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య మహాజభ రాష్ట్ర కార్యదర్శి బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్తా, ఆయుష్ యోగా సమితి నిర్వాహకుడు ఆనంద్ గురూజీ, నాగరాజు, 12 వవార్డు టీడీపీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే ప్రజలకు స్వేచ్ఛ: గౌరు చరిత



వండుట్ల గ్రామంలో పావురాన్ని ఎగురవేస్తున్న టీడీపీ పాణ్యం అభ్యర్థి గౌరు చరిత



ఎల్‌కే తండా గ్రామంలో గిరిజన సంప్రదాయ దుస్తుల్లో గౌరు చరిత

గడివేముల, ఏప్రిల్ 26: సంక్షేమ పాలన తీసుకొస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో రాక్షస పాలన సాగించారని, టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తారని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత అన్నారు. జగన్ సీఎం పీఠం ఎక్కిన తరువాత సామాన్యులపై దాడులు పెరిగాయని ఆరోపించారు. అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛ కరువైందని అన్నారు. అన్ని వర్గాల వారు ఆర్థిక పురోగతి సాధించారని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి రాక్షస పాలనకు అంతమందించాలని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత శుక్రవారం వండుట్ల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పావురాళ్లను ఎగురవేసి ప్రజలకు పిలుపునిచ్చారు.

● వైసీపీ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత అన్నారు. మండలంలోని వండుట్ల గ్రామంలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనలో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని అన్నారు. పంట సాగు చేసేందుకు సాగునీరు ఇవ్వలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని అన్నారు. రిజర్వాయర్లకు మరమ్మతులు చేయలేదని అన్నారు. రైతుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరికి, తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు.

● టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత అన్నారు. మండలంలోని ఎల్‌కే తండా, వండుట్ల, మంచాలకట్ట, గని గ్రామంలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పరిశ్రమలు రాకపోవడంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కరువయ్యాయని అన్నారు. వైసీపీ నాయకులు ప్రజల సంక్షేమం వదిలేసి అక్రమార్జనపైనే దృష్టి పెట్టారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్, బస్సు చార్జీలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపారని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ ఎస్ఏ రఫిక్, మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, గని హర్ష, రాజునాయక్, వండుట్ల సర్పంచ్ గంగాధర్‌రెడ్డి, కాలిద్‌బాషా, గిరిబాబు, రంగస్వామినాయక్, సుబ్బన్ననాయక్, గణేష్, ఐటీడీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఎల్‌కే తండా గ్రామంలో గిరిజనుల సంప్రదాయ దుస్తులు ధరించి గౌరు చరిత ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ వాసులు ఆమెకు తమ సంప్రదాయ నృత్యంతో స్వాగతం పలికారు.

టీడీపీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి: మాండ్ర



అల్లూరు మాండ్ర దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన మహిళలు



నందికొట్కూరులో టీడీపీలో చేరిన వారితో శివానందరెడ్డి, జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 27: టీడీపీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాండ్ర ఉమాదేవి అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర దంపతుల సమక్షంలో శుక్రవారం అల్లూరు గ్రామ వైసీపీ నాయకులు, మహిళలు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మదార్‌సాహెబ్, రజాక్ బాషా, అజ్మతుల్లా, చాంద్‌బాషా, గఫార్, రఫీ, రజాక్, సలీం, మదార్ బీ, దాది బీ, అలిమాబీ, కమలాబీ తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలంలోని చౌట్కూరు గ్రామంలో శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేశ్‌రెడ్డి, గుండం రమణారెడ్డి, గోకారి ఆధ్వర్యంలో నరసింహగౌడు, సుభాన్ ఖాన్, చంద్ర, స్వామన్నతో పాటు వంద కుటుంబాలు టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ అభ్యర్థి జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరాయి. అనంతరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఆ తర్వాత బహిరంగ సభ ఏర్పాటు చేశారు. మాండ్ర శివానందరెడ్డి చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని అన్నారు. మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకం సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

● గుడిపాడు గ్రామంలో వైసీపీకి చెందిన మహేష్, అక్షన్న, శ్రీనివాసులు, ఎల్లస్వామి, వెంకటరాముడు, శ్రీను, పుల్లన్న, వెంటేశ్వర్లు, రామాంజనేయులు వైసీపీని వీడి మాండ్ర శివానందరెడ్డి, అభ్యర్థి గిత్తా జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ తర్వాత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శివరామి రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, స్వామి రెడ్డి, రవీంద్రబాబు, సోఫీ సాహెబ్, ఇద్రుస్, నాగేంద్రుడు, మోహిద్దీన్, బాబు సాహెబ్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పట్టణంలోని 20వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు బచ్చు శ్రీను ఆధ్వర్యంలో చంద్రశేఖర్, రవి, డెకరేషన్, భీముడు, కిట్టు, వీరయ్య, చారి రమేష్, గోపి టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ అభ్యర్థి జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరారు. శివానందరెడ్డి మాట్లాడుతూ టీడీపీ గెలుపుకోసం ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. లాయర్ జాకీర్, జమీల్ పాల్గొన్నారు.

పాములపాడు: భానుముక్కల గ్రామంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావు, రాముచౌదరి, హనుమంతరెడ్డి, తిమ్మారెడ్డి, రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్, గోవిందు, హరినాథరెడ్డితో కలిసి పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మధుకృష్ణ, సురేశ్, హరిప్రసాద్, రఘురామిరెడ్డి, లింగేశ్‌గౌడ్, నాగార్జునరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



భానుముక్కల గ్రామంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

యువకుడి ఆత్మహత్య

శ్రీశైలం, ఏప్రిల్ 26: శ్రీశైలం పరిధిలోని కొత్తపేట ఎస్సీ కాలనీలో ఓ యువకుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలివీ.. ఉరవకొండ లక్ష్మీనారాయణ (35) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుండిపెంట ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పలువురి నామినేషన్లు తిరస్కరణ

నందికొట్కూరు, ఏప్రిల్ 26: నందికొట్కూరు నియోజకవర్గంలో ఏడు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. శుక్రవారం ఆర్వో కార్యాలయంలో నామినేషన్ పరిశీలన ప్రక్రియను ఆర్వో దాసు నిర్వహించారు. నియోజకవర్గంలో 28 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా... సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఏడుగురు అభ్యర్థుల నామినేషన్‌లు తిరస్కరణకు గురయ్యాయి. వైసీపీ తరుపున నామినేషన్ వేసిన కాటం వెంకటరమణ, పెరుమాళ్ల మధు ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థి పబ్బతి శ్రీరాములు, కాంగ్రెస్ తరుపున నామినేషన్ వేసిన తోగూరు వివేక్ జయ సందీప్, స్వతంత్ర అభ్యర్థులు గండి సంజీవుడు, మిద్దెల నాగలింగం, బొర్రెల్లి నిర్మలాదేవిల నామినేషన్‌లను ఆర్వో దాసు తిరస్కరించారు.

ఆత్మకూరు, ఏప్రిల్ 26: నామినేషన్ల పరిశీలనలో ఐదు నామినేషన్లను తిరస్కరించినట్లు ఆర్వో సుధారాణి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ. 24మంది అభ్యర్థులు మొత్తం 41నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. వైసీపీ తరఫున సింగారెడ్డి కార్తీక్‌రెడ్డి, టీడీపీ తరుపున బుడ్డా శైలజ, ఎస్‌డీపీఐ తరుపున మహెబూబ్‌బాషా నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ ఆయా పార్టీలకు సంబంధించిన బీ-ఫారమ్‌లు సమర్పించకపోవడంతో వారి నామినేషన్లను రద్దు చేసినట్లు తెలిపారు. ఇండిపెండెంట్లుగా నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ అఫిడవిట్లు సరిగ్గా లేకపోవడంతో జనావత్ నాగస్వామినాయక్, కాటెపోగు రాజమ్మలకు చెందిన నామినేషన్లను తిరస్కరించినట్లు చెప్పారు.

బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిక



మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన సంజీవనగర్ తండా వాసులు

ఆత్మకూరు, ఏప్రిల్ 26: ఆత్మకూరు మండలంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి మరో భారీ షాక్ తగిలింది. సంజీవనగర్ తండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శివమ్మబాయి, ఉప సర్పంచ్ వరలక్ష్మీబాయి, వార్డు సభ్యురాలు శివమ్మబాయి, గ్రామ వలంటీరు శశిరేఖబాయితో పాటు మరికొన్ని కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో వారికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బుడ్డా మాట్లాడుతూ శ్రీశైల నియోజకవర్గంలో చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయని చెప్పారు. ఇదేస్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలోకి చేరిన వారిలో ఉపేంద్రనాయక్, కిరణ్‌నాయక్, మల్లికార్జునాయక్, రవినాయక్, చంద్రపాల్, మంత్రు నాయక్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, కరివేన గ్రామ నాయకులు కొండలరావు, రవీంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న బుడ్డా

శ్రీశైలం: శ్రీశైలంలో జరిగిన కుంభోత్సవ వేడుకను పురస్కరించుకుని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి భ్రమరాంబికాదేవిని దర్శించుకున్నారు. కుంభోత్సవ వేడుక సందర్భంగా అమ్మవారు నిజరూప అలంకరణలో దర్శనమివ్వడంతో బుడ్డా రాజశేఖరరెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఆలయనకు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

'సమాచారం ఇవ్వండి'

నంద్యాల క్రైం, ఏప్రిల్ 26: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రజలు 6300633826కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎన్నికల ప్రత్యేక పోలీస్ పరిశీలనాధికారి హిమాన్ష్ శంకర్ త్రివేది సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపెట్టడానికి నగదు, బంగారం, మద్యం ఇతరత్రా వస్తువులను పంపిణీ జరిగినా, అక్ర మంగా రవాణా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 26: కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులు మణికందన్, టీకారాం మీనా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేసి పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక జిల్లాలో అధికారులు సీజ్‌చేసిన నగదు వివరాలతో పాటుగా అభ్యర్థుల ఖర్చుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఉల్లంఘనలు, తీసుకున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రచురితమవుతున్న పత్రికలు వాటి ద్వారా వస్తున్న వార్తలు, జిల్లాలో ప్రసారమవుతున్న లోకల్, శాటిలైట్ చానల్స్ వివరాలు, వాటిపై ఏర్పాటు చేసిన నిఘా తదితర అంశాలను జిల్లా పౌర సంబంధాల అధికారి మల్లికార్జునయ్యను అడిగి తెలుసుకున్నారు.

బుడ్డా నామినేషన్‌పై తప్పుడు ప్రచారం

● ఆర్వోకు ఫిర్యాదు చేసిన టీడీపీ తరపు న్యాయవాదులు

ఆత్మకూరు, ఏప్రిల్ 26: వైసీపీ తరుపున న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి నామినేషన్‌ను ఆర్వో పక్కన పెట్టారని నంద్యాలకు చెందిన వైసీపీ తరుపు న్యాయవాది కృష్ణారెడ్డి ఆర్వో కార్యాలయ ప్రాంగణంలోనే ఒక వీడియో తీసి వైసీపీ శ్రేణులకు పంపించారు. వైసీపీ శ్రేణులకు శుభవార్త అంటూ సోషల్ మీడియాల్లో షేర్ చేశారు. దీంతో టీడీపీ తరుపు న్యాయవాదులు, కొంతమంది ముఖ్య నాయకులు ఆర్వో కార్యాలయానికి చేరుకున్నారు. అలాగే శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డితో, వైసీపీ తరుపున న్యాయవాదులు, కొంత మంది నాయకులు కూడా అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలోనే టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ విభాగానికి చెందిన సీనియర్ అడ్వకేట్ తులసీరెడ్డి కూడా ఆర్వో కార్యాలయానికి వచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఆయన్ని వందమీటర్ల దూరంలోనే పోలీసులు అడ్డుకున్నారు. టీడీపీ తరుపు న్యాయవాదులు గోవిందరెడ్డి, గిరిరాజు, కేశవరెడ్డి, రవికుమార్ ఆర్వో సుధారాణికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. బుడ్డా పరువుకు భంగం కలిగించేలా చేసిన న్యాయవాది కృష్ణారెడ్డిపై పరువునష్టం దావా వేస్తామని వారు వెల్లడించారు. బుడ్డా రాజశేఖరరెడ్డి నామినేషన్‌లోని చరాస్తుల అఫిడవిట్‌లో పేర్కొన్న వాహనానికి సంబంధించి రిజిస్ట్రేషన్ నంబర్, ఇతర వివరాలు లేకుండా వాహన ధరను మాత్రమే పొందుపర్చారని వైసీపీ తరుపున న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఆర్వో సుధారాణి చెప్పారు. అయితే ఎన్నికల నియావళి ప్రకారం ఆయన నామినేషన్‌ను ఆమోదించినట్లు తెలిపారు. తాను అధికారికంగా ప్రకటించనప్పటికీ సోషల్ మీడియాలో వైరల్ చేసిన న్యాయవాది కృష్ణారెడ్డిపై ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

టీడీపీ మార్కాపురం పరిశీలకుడిగా హరిబాబు



నారాయణరెడ్డితో హరిబాబు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 26: నంద్యాలకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుపల్లి హరిబాబును ప్రకాశం జిల్లా మార్కాపురం అసెంబ్లీ టీడీపీ పరిశీలకుడిగా అధిష్ఠానం నియమించింది. పరిశీలకుడిగా బాధ్యతలు చేపట్టినట్లు హరిబాబు వెల్లడించారు. టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డితో సమావేశమై ఎన్నికల ప్రచారం, పోలింగ్ సంబంధిత ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. మార్కాపురం పరిశీలకుడిగా తనను నియమించిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ నాయకుడు అనుమానాస్పద మృతి

నందికొట్కూరు, ఏప్రిల్ 26: అనుమానాస్పద స్థితిలో వైసీపీ నాయకుడు జంగంపాడు రాజు మృతి చెందారు. వివరాలివీ.. నందికొట్కూరు మండలం జంగంపాడుకు చెందిన రాజు ఈనెల 23వ తేదీ రాత్రి 11 గంటలకు నందికొట్కూరు పట్టణంలో శారదా లాడ్జిలో రూమ్ బాడుగకు తీసుకొని ఉన్నారు. రాజు తల్లిశేషమ్మ చివరగా 25వ తేదీ ఫోన్ చేయగా నందికొట్కూరులోనే ఉన్నాయని తెలిపారు. 24వ తేదీన మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో రాజు బయటి నుంచి ఆహారం, వాటర్ బాటిళ్లు తీసుకొని రూములోకి వెళ్లినట్లు తెలిపారు. అయితే శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో రూమును శుభ్రం చేసేందుకు వెళ్లి బాయ్ ఎంత సేపు తలుపు కొట్టినా తెరవకపోవడంతో పట్టణ సీఐ ప్రకాష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన లాడ్జికి చేరుకొని తలుపులను పగలగొట్టి చూడగా రాజు రక్తపు మడుగులో పడి మృతి చెందినట్లు గురించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూమ్‌లో ఉన్న పరిస్థితులను గమనించిన పోలీసులు బిర్యాని, నాలుగు మందు బాటిళ్లు ఉన్నట్లు గమనించారు. రాజు తల్లి శేషమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అగ్రిగోల్డ్ ఏజెంట్ మృతి

ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 26: ఆత్మకూరు పట్టణానికి చెందిన అగ్రిగోల్డ్ ఏజెంట్ పుల్లయ్య ఆచారి మనోవేదన గురై శుక్రవారం మృతి చెందారు. ఈయన అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా చేరి సుమారు 20 లక్షల మేర ఆ సంస్థకు ప్రజలతో డబ్బులు డిపాజిట్ చేయించారు. 2015లో ఆ సంస్థ బోర్డు తిప్పేయడంతో బాధితులు ఏజెంట్లపై తీవ్రంగా ఒత్తిడి చేశారు. దీంతో కొంత మందికి అప్పట్లో ఆయన ఆస్తులను విక్రయించి చెల్లించారని, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందినట్లు అగ్రిగోల్డ్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున తెలిపారు. మనో వేదనతో గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందారని అన్నారు. ఆయన మృతి పట్ల అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడితో పాటు ఏజెంట్లు సంతాపం తెలిపారు. వారు మాట్లాడుతూ.. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టక పోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పేదలను జలగలా పీల్చేస్తున్న జగన్

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 26: పన్నుల రూపంలో పేదల రక్తాన్ని జలగలా సీఎం జగన్ పీలుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని అవుకుమెట్ట, పింజరిపేట, జెండామాను ఏరియాలో ప్రజాగళం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని బీసీ పాల్గొన్నారు. ప్రజాగళంలో బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీని ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. బీసీకి టీడీపీ, జనసేన శ్రేణులు ఘనస్వాగతం పలికారు. బీసీ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. 15 రోజుల్లో వైసీపీ దురాగతాలకు అంతం పలికే సమయం ఆసన్నమైందని బీసీ అన్నారు. వైసీపీ ఏపీని పూర్తిగా నాశనం చేసిందని అన్నారు. ఇలాంటి పార్టీ ప్రజలకు అవసరం లేదని బీసీ అన్నారు. రాష్ట్రంలో వైసీపీ బాధితులు, నష్టపోయిన రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు టీడీపీ స్టార్ క్యాంపెయినర్లని అన్నారు. వైసీపీ అరాచక పాలనను ప్రతి గడపకు వెళ్లి వివరించి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ

కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఇటిక్యాల బాలిరెడ్డి తన అనుచరులు 200 కుటుంబాల వారితో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. బాలిరెడ్డికి, ఆయన కుమారులకు, అనుచరులకు బీసీ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కొలిమిగుండ్లకు చెందిన కదిరి చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణప్రసాద్‌రెడ్డి, కదిరి రామాంజనేయరెడ్డి తదితర పది కుటుంబాలవారు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే హుసేనాపురం జహంగీర్ అధ్వర్యంలో గడ్డం హుసేన్‌బాషా, ఇదూర్‌సావలి, మహబూబ్‌షరీఫ్ తదితరులు టీడీపీలో చేరారు. హుసేనాపురం గ్రామానికి చెందిన బుడ్డేహుసేన్‌సా, ఆకుల హుసేన్‌సా, బజ్జిహుసేన్‌బీ, గుల్లగుర్తి గ్రామానికి చెందిన వలంటీర్లు పోరుమామిళ్ల శ్రీధర్, నాగేశ్వరరెడ్డి, ఆబూసి వెంకటేశ్ తదితరులు టీడీపీలో చేరారు.



బనగానపల్లెలో బీసీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

బీసీ ఇందిరమ్మ సమక్షంలో..

అవుకు: అవుకు పట్టణంలో శుక్రవారం బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దనరెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ సమక్షంలో అవుకు ఈబీసీ కాలనీకి చెందిన వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి బీసీ ఇందిరమ్మ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఈబీసీ కాలనీకి చెందిన గాలిమిషన్ సుధాకర్, వెలుగు పెద్దరంగస్వామి, మీసాల రామకృష్ణ, దాసరి చిన్నవెంకట రాముడు, పెద్ద బాలకేశాలు, రైస్‌మిల్ పుల్లయ్య సుబ్బరాయుడు, హోటల్ పుల్లమ్మ, కాటసాని జయరామిరెడ్డి, కట్టెల సుబ్బయ్య ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీ పక్కీరారెడ్డి, కాటసాని చంద్రశేఖర్ రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, బత్తిన మద్దిలేటి గౌడ్ పాల్గొన్నారు.





ఇటిక్యాల బాలిరెడ్డికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి, అవుకులో బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు

బుగ్గన చెప్పేవన్నీ గాలిమాటలే

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



తాగునీటి సమస్యపై మహిళలతో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

డోన్, ఏప్రిల్ 26: డోన్ నియోజకవర్గ ప్రజలకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పేవన్నీ గాలి మాటలేనని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపురం, తాడూరు గ్రామాల్లో కూతురు కోట్ల నివేదితతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మాపురం గ్రామంలో పలువురు మహిళలు తాగునీటి సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నామని కోట్ల సుజాతమ్మ దృష్టికి తీసుకువచ్చారు. కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ మంత్రి బుగ్గన అభివృద్ధి గురించి పెద్ద పెద్ద మాటలు చెబుతున్నాడని, గ్రామాల్లో కనీసం ప్రజలకు తాగునీరు కూడా దొరకని పరిస్థితి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి, రేగటి రామ్మోహన్‌రెడ్డి, భాస్కర్ నాయుడు, ధర్మవరం భరత్‌రెడ్డి, రంజిత్ కిరణ్, తాడూరు వెంకట రమణయ్య, మిద్దెపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గన నామినేషన్ తిరస్కరించే వరకు పోరాటం

డోన్, ఏప్రిల్ 26: అధికార బలంతో వైసీపీ డోన్ అసెంబ్లీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆమోదం పొందిన నామినేషన్‌ను తిరస్కరించే వరకు న్యాయ పోరాటం చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లికార్జున, ఓబులాపురం శేషిరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వడ్డె మహారాజ్‌తో కలిసి వలసల రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. డోన్‌లో శుక్రవారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జరిగిన నామినేషన్ పరిశీలనలో బుగ్గనతోపాటు కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలు అఫిడవిట్‌లో పొందుపరచకపోవడంపై టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. అయితే.. మొదట ఎన్నికల రిటర్నింగ్ అధికారి బుగ్గన నామినేషన్ పత్రంలో తప్పులు ఉన్నాయని, అంగీకరించి పెండింగ్‌లో ఉంచారన్నారు. బుగ్గన ఉన్నత స్థాయి నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారిపై ఒత్తిళ్లు తీసుకువచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

జగన్‌కు ఓటు వేస్తే ఆస్తులు ఉండవు: కోట్ల

డోన్, ఏప్రిల్ 26: సీఎం జగన్‌కు మళ్లీ ఓటు వేస్తే ప్రజల ఆస్తులు ఉండవని కేంద్ర మాజీ మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మతోపాటు పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం జగన్ దోపిడీ విధానాలతో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. ఉచితంగా దొరికే ఇసుకను మాఫీయా చేతులతో కలిపి సీఎం జగన్ ఆయన మంత్రులు వేల కోట్లు దండుకున్నారని ఆరోపించారు. ప్రజలకు పని చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం అవినీతి అక్రమాల్లో మునిగిపోయి, ప్రజల డబ్బులను జలగలా పీల్చివేశారని ధ్వజమెత్తారు. డోన్ నియోజకవర్గంలో నీతికి, అవినీతికి మధ్య పోరాటం జరుగుతోందన్నారు. ప్రజలు బుగ్గన లాంటి దొరల పాలన కోరుకోవడం లేదన్నారు. మంత్రి బుగ్గనను కలిసి ఏమైనా సమస్యలు చెప్పుకోవాలంటే ప్రజలకు కూడా అనుమతి లేకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, ఓబులాపురం శేషిరెడ్డి, సేనా, ఓంప్రకాష్, మిద్దెపల్లి గోవిందు, ఆకుల శేఖర్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: రాష్ట్రంలో టీడీపీతోనే సుపరిపాలన సాధ్యమని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని అంబాపురం గ్రామంలో సుంకులా పరమేశ్వరి దేవికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కొమ్మూరి కొట్టాల, హెచ్.కొట్టాల గ్రామాల్లోనూ టీడీపీ నాయకులు ఉన్నం ఎల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మీ ఆధ్వర్యంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో దళిత, బడుగు, బలహీనవర్గాలపై దౌర్జన్యాలు అధికమయ్యానన్నారు. కార్యక్రమంలో సోమశేఖర్ రెడ్డి, కోట్ల గిరిధర్ రెడ్డి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, ఆర్.బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, జావాజీ వెంకటేశ్వర్లు, మేకల నాగరాజు, రూబెన్, రవీంద్రనాయ్, ముల్లా ఎంఎస్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

అవుకు, ఏప్రిల్ 26: అవుకు మండలం కాశీపురం గ్రామానికి చెందిన రైతు పుల్లయ్య(34) అప్పుల బాధతో ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కిరణ్ బాబు వివరాల మేరకు.. పుల్లయ్యకు రెండు ఎకరాల సొంత పొలం ఉండగా మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. గత నాలుగేళ్లుగా మిరప పంటను సాగు చేశాడు. పెట్టుబడుల కోసం రూ.6 లక్షలు అప్పు చేశాడు. సరైన దిగుబడులు రాకపోవడంతో అప్పు తీరే పరిస్థితి కనిపించలేదు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి తల్లి లక్ష్మీదేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భర్త కోసం బైఠాయింపు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 26: భర్త కోసం ఓ మహిళ శుక్రవారం నిరసనకు దిగింది. భర్త ఇంటిముందు బైఠాయించింది. ఈ ఘటన మండలంలోని జోళదరాశి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన సునయానకు జోళదరాశికి చెందిన శివవర్ధన్‌రెడ్డితో 2018లో వివాహం జరిగింది. వీరి దాంపత్య జీవితం కొంతకాలం సజావుగా సాగింది. వీరికి ఒక కూతురు ఉంది. మూడు సంవత్సరాల క్రితం కుటుంబ కలహాలతో భర్తతో గొడవపడి సునయన పుట్టింటి వద్దనే ఉంటుంది. శుక్రవారం సునయన జోళదరాశికి వచ్చి భర్త కోసం ఇంటి ముందు బైఠాయించింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై ఆమెతోపాటు భర్త, బంధువులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రాక్షస పాలనకు అంతం తప్పదు

చాగలమర్రి, ఏప్రిల్ 26: రాష్ట్రంలో రాక్షస పాలనకు అంతం తప్పదని ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని చింతల చెరువు, పెద్దవంగలి, చిన్నవంగలి, నేలంపాడు, గొట్లూరు, బ్రాహ్మణపల్లె, మల్లేవేముల గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అఖిలప్రియ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికల పరిశీలకుడు కేవీ సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, నర్సిరెడ్డి, చిన్నపురెడ్డి, ఓబయ్య పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

చాగలమర్రి, ఏప్రిల్ 26: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో శుక్రవారం ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన యోహాన్, శ్రీను, చెన్నయ్యతో పాటు 20 కుటుంబాలు చేరాయి. అన్సర్‌బాషా, నాగరాజు, నరసింహులు, ఉసేన్‌వలి, జమాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బాబయ్య, కృష్ణారెడ్డి, గఫార్, నాగూర్‌వలి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

బనగానపల్లె, ఏప్రిల్ 26: మహిళలు స్వశక్తితో ఎదగాలని బనగానపల్లె కేవీకే కోఆర్డినేటర్ ధనలక్ష్మి అన్నారు. పొదుపు గ్రూపులకు పచ్చళ్ల తయారీపై యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. టాటాపవర్‌ఐ ప్రాజెక్టు వారి ఆర్థిక సాయంతో వేములపాడు, గోకులదిన్నె గ్రామ పొదుపు మహిళలకు నైపుణ్య శిక్షణ ఇచ్చారు. రమణయ్య, సురేశ్‌కుమార్, రవిగౌడ్, లక్ష్మిప్రియ పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో టీడీపీదే విజయం'

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 26: ఆళ్లగడ్డలో టీడీపీదే విజయమని ఆ పార్టీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మాయలూరు, తుడుములదిన్నె, ఎస్.కొత్తపల్లె, నర్సిపల్లె, పడిగెపాడు, సుద్దమల్ల, రూపనగుడి గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

రుద్రవరం, ఏప్రిల్ 26: మండలంలోని ఆలమూరు, చిత్రేణిపల్లె, హరినగరం, ముకుందాపురం, ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లె గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసినట్లు సెక్టోరియల్ అధికారి శ్రీనివాసశర్మ తెలిపారు. శుక్రవారం అన్ని పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేసినట్లు తెలిపారు.

వైసీపీని ఇంటికి సాగనంపుదాం

బనగానపల్లె, ఏప్రిల్ 26: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అవుకు మండలంలోని రామవరం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు కరువు కాటకాలతో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. టీడీపీ నాయకులు కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు న్యాయం

కొలిమిగుండ్ల(రూరల్), ఏప్రిల్ 26: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కొలిమిగుండ్ల మండల తెలుగు యువత అధ్యక్షుడు గొంగటి హుస్సేన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెట్నికోట గ్రామంలో ప్రజాగళం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, అబ్దుల్ ఖాదర్, వెంకటేశ్వరరెడ్డి, శేఖరరెడ్డి, ఎమ్మార్పీస్ నాయకులు పాల్గొన్నారు.

రాచర్ల ఎస్‌ఐగా చంద్రమోహన్

ప్యాపిలి, ఏప్రిల్ 26: మండలంలోని రాచర్ల ఎస్‌ఐగా చంద్రమోహన్ శుక్రవారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ వెంకట రమణ మూడు నెలల క్రితం తెలంగాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో అక్కడ జలదుర్గం ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఇన్‌చార్జి ఎస్‌ఐగా ఉన్నారు. కడప తాలూకా స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐని ప్రభుత్వం రాచర్ల ఎస్‌ఐగా నియమించింది.

గజ వాహనంపై చెన్నకేశవస్వామి

బేతంచెర్ల, ఏప్రిల్ 26: పట్టణంలోని గౌరిపేటలో ఆంజనేయస్వామి ఆలయంలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మద్దిలేటి, బుగ్గన విశ్వనాథరెడ్డి, పులారెడ్డి, మారుతి కృష్ణశర్మ, సుబ్బారెడ్డి, రమణ, వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి పల్లకీ సేవ

బనగానపల్లె, ఏప్రిల్ 26: నందవరం చౌడేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

Format C-7

<u>Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection, as also as to why other individuals without criminal antecedents could not be selected as candidates</u>

<u>(As per the Commission's directions issued in pursuance of the Order dated 13.02.2020 of the Hon'ble Supreme Court in contempt petition(C) no. 2192 of 2018 in WP(C) no. 536 of 2011)</u>

Name of Political Party : BAHUJAN SAMAJ PARTY
Name of the Election : Legislative Assembly General Election 2024
Name of State/UT : ANDHRA PRADESH
Name of the Constituency : **141- DHONE**
Name of the Candidate : **G RAMUDU**

Sl.No.			
1.	Criminal antecedents		
	a.	Nature of the offences	Section 506, 353 Of IPC
	b.	Case No.	CC No. 545/2014
	c.	Name of the Court	Judicial Ist Class Magistrate Dhone
	d.	Whether charges have been framed or not (Yes/No)	YES Simple Imprisonment for 6 month for offence U/s 353 of IPC and Fine of Rs. 2000/ for Offence u/s 506 of IPC in default to undergo one month simple imprisonment
	e.	Date of conviction, if any	06.11.2019
	f.	Details of punishment undergone, if any	NIL
	g.	Any other information required to be given	In Appeal in respect to charge under 353 IPC is dissmissed to the extent of Charge U/S 506 IPC and ordered fine amount of RS 2000/. Fine Amount Paid
2.	The reasons for the selection of the candidate. Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words)		In comparison to the other candidates and their history, it was found to be suitable being the candidate has stated that false FIR has been lodged against him
3.	Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words)		The offences are not grave one seems to be based on political vindicta. His image supported by the local office bearers of the party as clean and good.

--- sd ---
Signature of office bearer of the Political Party
Name and designation : Sridhar (National Treasurer)